
# దాహం

బెహరా
వెంకట సుబ్బారావు



**జ్యే**ష్ఠ మాసం! మధ్యాహ్నం ఒంటి గంట వేళ. ఎండ నిప్పులు చెరుగుతోంది. కరెంటు ఆగిపోవడంతో సీలింగ్ ఫాన్ విశ్రాంతి తీసుకొందుకుపక్రమించింది. కృష్ణమూర్తికి నిద్రాభంగం కలిగింది. లేచి కూర్చున్నాడు.

దాహం వేసింది, భార్యను పిల్చి దాహం తెమ్మన్నాడు. సుజాత తెచ్చిన చల్లటి చిక్కని మజ్జిగను తాగుతూంటే వీధిలోంచి కేక వినిపించింది.

''అమ్మా ఆకలి! నాలుగు రోజుల నుంచీ తిండిలేదు. కాస్త గెంజి మెతుకులు వేయించడమ్మా!''

''ఇది బామ్మరిల్లు! ఇలాంటప్పుడు అన్నం పెట్టరు! మరో చోటుకి పో!''

వీధి అరుగు మీద పశువులకి కన్నెలు అల్లుతూన్న పాలేరు పద్దయ్య జవాబిచ్చాడు.

''అమ్మా! దాహంతో నాలుక పిడచకట్టుకు పోతోంది! మంచినీళ్లయినా పోయించు తల్లీ!''

దాహం తీర్చడానికి మంచి నీళ్ళుకూడా లేవనడానికి పద్దయ్య మనసంగీకరించలేదు. 'ఇంత వూరుండగా ఈ యింటికే రావాలా!' మనసులోనే విసుక్కొన్నాడు. చేస్తున్న పని ఆపితే కన్నిపురి సడలిపోతుంది. తాడు మీద పెద్ద రాయి పెట్టిలోపల కెళ్లాడు. పెద్ద సిలవరి గిన్నెతో పట్టుకెళ్లి వాళ్ల దోసిట్లో పోసాడు. ఇద్దరూ కల్సి గిన్నెడు నీళ్లు తాగి తేన్చుకొన్నారు. వాళ్ల పరిస్థితి నర్థం చేసుకొన్నాడు పద్దయ్య. జాలిగా చూసాడు.

''ఏవూరు?'' అడిగాడు సానుభూతిగా.

''సిగాకోళం దగ్గిర కొత్తూరు బాబూ! వంశదార పొంగిపోయింది. నా యజమాన్నీ, దీని మొగుణ్ణి పొట్ట బెట్టుకొంది. ఈ మూణ్ణెల్ల నుంచి యిలా వూరూరా తిరిగి ముష్టెత్తుకుని బతుకుతున్నాం'' చెప్పిందామె.

శ్రీకాకుళం దగ్గర కొత్తూరు అనగానే సుజాతా కృష్ణమూర్తి ఒకరి మొహాలొకరు చూసుకొన్నారు. సుజాత కన్న వారి వూరు కొత్తూరే! కిటికీ తలుపులు తీసి వీధిలోకి చూసింది సుజాత కుతూహలంగా. ఒక ముసల్ది, ఒక యువతి కన్పించారు. దూరం నుంచి పోల్చలేకపోయింది. వీధిలోకి వెళ్లింది. భార్య వెనుకనే వెళ్లాడు కృష్ణమూర్తి.

''ఏ వూరు మీది?'' అడిగింది సుజాత.

''సిగాకోళం దగ్గిరి కొత్తూరు తల్లీ!'' చెప్పిందా ముసలమ్మ సుజాతను పట్టిపట్టి చూస్తూ.

''తవరు కరణంగారమ్మాయిగారుకదండి!'' తల్లి చాటున నిలబడ్డ ఆ యువతి అడిగింది.

''అవును!'' అంది తెల్లబోతూ సుజాత, వాళ్లెవరయిందీ జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నిస్తోంది. ఆ ముసలమ్మ మొహం చేటంతయింది.

''మా కరణం బాబుగారి బొట్టా!'' ఆప్యాయంగా చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది. అవునన్నట్లు తలూపింది సుజాత.

''ఇది నాకూతురు రత్తమ్మ! రాత్రి పొలం కాపుకి మావా అల్లుడూ వెళ్లారు! మరి తిరిగి రాలేదు. వంశదార తల్లి ఆళ్లిదర్నీ పొట్టన పెట్టుకుంది! మమ్మల్ని అనాథల్ని చేసింది. వూరూరా తిరిగి ముష్టెత్తుకు బతుకుతున్నాం!'' కంటతడి బెట్టుకొంది ఆ ముసలిది.

''అరుగు మీదికి రండి! ఎండగా వుంది!'' ఆదరంతో ఆహ్వానించింది సుజాత. వాళ్లెవరో జ్ఞాపకానికొచ్చింది.

''పెదరాజుగారి కమతంలో పనిచేసే కిష్టయ్య పెళ్లాం ముత్యాలువి కదూ!'' అడిగింది.

''అవును తల్లీ! తవర్నీ వూరిచ్చినట్టు మాకు తెల్దు! వూరూరు తిరిగి యిక్కడికొచ్చినాం!'' అంది ముత్యాలు కొండంత ఆశతో.

''అన్నం పెడ్తా తింటారా?''

ఆ తల్లీ కూతుళ్ల కళ్లు ఆనందంతో మెరిసాయ్. ఆ రోజు అక్కడనే వుండమంది సుజాత.

''మన పనిమనిషి ముసలిదయిపోయింది. సరిగా చేయడం లేదని అత్తగారు విసుక్కొంటున్నారు. ముత్యాల్నీ, కూతుర్నీ మన దగ్గర వుండమందాం! ఏమంటారు?'' ఆ రాత్రి భర్త అనుమతిని కోరింది సుజాత. భర్త మౌనం వహించడంతో మళ్లీ అడిగింది. ''పాపం వాళ్ల కెవరూ లేరు! పొలాలకి అంబళ్లు తీసుకెళ్లడానికీ యింటి పనులకీ పనుకొస్తారు. వుండమందా



మండీ!'' బతిమాలింది.

''నాకేం అభ్యంతరం లేదు! పని చేయించుకొనే వాళ్ళు మీరు!'' అనేసాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి జగన్నాథంగారి ఏకైకపుత్రుడు. జగన్నాథం ఆ తాలూకాకి పెద్ద భూకామందు! ఆ పైన పెద్ద కాంట్రాక్టులు చేస్తూవుంటాడు. మంచి పలుకుబడిగల మనిషి. కృష్ణమూర్తికి చదువబ్బలేదు. హైస్కూలు చదువు పూర్తిచేయలేకపోయాడు. వయసు వచ్చింది. తండ్రి మంచి సంబంధం చూసి పెళ్లి చేసాడు. కాంట్రాక్టు పనుల మీద ఎప్పుడూ కాంపులు తిరుగుతూవుంటాడు జగన్నాథం. ఇంటి దగ్గర వుంటూ వ్యవసాయం పనులు చూస్తూ వుంటాడు కృష్ణమూర్తి. తండ్రి గ్రామంలో లేనప్పుడు అప్పుడప్పుడు పట్నం వెళ్లి జల్సా చేస్తూవుంటాడు. ఆ విషయము తెల్సినా తెలియనట్లుగా వూరుకొంటాడు జగన్నాథం.

కొన్ని నెలలుగడిచాయ్:

''బాబూ! పెదబాబూ! అన్యాయం జరిగిపోయింది!'' ఏడ్చుకొంటూ జగన్నాథం దగ్గర కెళ్లింది ముత్యాలు. జగన్నాథం తాపీగా చుట్ట కాలుస్తూ వరండాలో వాలు కుర్చీలో కూర్చున్నాడు. తనకు జరిగిన అన్యాయం ఏమిటో తెల్సుకొని దానికి బాధ్యులైన వారిని శిక్షిస్తాడన్న ఆశతో తన వద్దకు వస్తోందని గ్రహించాడు. మౌనంగా ఆమెను చూసాడు.

''అయ్యగోరూ! గోరం జరిగిపోనాది!'' ఆయనకు దగ్గరగా ఎదురుగా నిలబడి ఘొల్లుమంది ముత్యాలు. జగన్నాథం తొణకలేదు బెణకలేదు. నిదానంగా చూస్తూ వుండిపోయారు.

ముత్యాలు వెనుక రత్తమ్మ తలవొంచుకొని నిలబడింది.

"ఏం జరిగింది?" నిదానంగా అడిగాడు జగన్నాథం.

"ఏం జరగడవేంటి బాబూ! నా కూతురి బతుకు నాశనం అయింది! దాన్ని పాడు చేసారు చిన బాబుగారు!" స్వరం హెచ్చించింది ముత్యాలు.

జగన్నాథం షాక్ తినలేదు. చేతిలోని చుట్టని దూరంగా విసరి రత్తమ్మ మొహంలోకి చూసారు. భయంతో కంపించి పోతూ తల వం చుకొంది రత్తమ్మ. ఏడుస్తోంది.

"ఇలా సేత్తారనుకోలేదు బాబూ!" రాగాలు ప్రారంభించింది ముత్యాలు.

"దాహం వేస్తోంది మంచినీళ్లు పంపమంటే రత్తమ్మని తీసుకెళ్లమన్నా! తీరా గదిలో కెళ్లాక..."

ఇక చెప్పలేక ఆగిపోయింది ముత్యాలు.

జగన్నాథానికి అంతా అవగాహన అయింది. మౌనం వహించాడు. అతని మౌనాన్ని ఆసరాగా తీసుకొని తిరిగి రాగాలు మొదలుపెట్టింది ముత్యాలు.

"ఇట్లాంటి గోరం తవ వంశంలో లేదు బాబూ!" చీకాకు పుట్టి లేచి నిలబడ్డాడు జగన్నాథం.

"పెద్దింటోరు! నీడనిచ్చారని సంబరపడ్డాం! కన్న బిడ్డలాంటిది! చూడండి బాబూ! భయంతో ఎలా కంపరమెత్తిపోతోందో!"

జగన్నాథం మొహం జేవురించింది.

"ఆర్నెల్ల బట్టీ కడుపునిండా తింటోంది కదూ కండపుష్టి కలిగి కామం చెలరేగితే కంపర మెత్తి వుంటుంది. మంచినీళ్లు తీసుకెళ్ళి సోయ గాలు వలకపోసుంటుంది నీ కూతురు! ఆవుపడ్డ వెల్లి ఆబోతు ముందు నిలబడితే ఏమౌతుంది?" అయ్యగారి మాటలకి ఆశ్చర్యపోయారా తల్లీ కూతుళ్లు.

"అలా అనకండి బాబూ! నా బిడ్డ లాంటిది కాదు! పెద్దోరు! పెద్ద మనసున్నోరు! గేనం వున్నోరు!" విలవిల్లాడింది ముత్యాలు.

"గదిలో ఒంటరిగా అబ్బాయి వున్నాడని తెల్సి నీ కూతుర్నెందుకు పంపావ్?" కుపితు డయ్యాడు జగన్నాథం. బాబుగారి ప్రశ్నకి అదరిపడింది ముత్యాలు.

"ఇప్పటికెన్నో సార్లు చిన బాబుగారి గదిలో కెళ్ళింది బాబూ! ఎప్పుడు యిలా పవర్తించలేదు చిన బాబు! పట్టపగలే యింత గోరం సేత్తారను కోలేదు బాబూ!"

"చూధు ముత్యాలూ! దేహానికి ఎన్నో బాధ లుంటాయ్. మలమూత్రాలు విసర్జిస్తే దేహానికి హాయిగా వుంటుంది. ఆకలి వేసినప్పుడు అన్నం తింటే తృప్తిగా వుంటుంది. దాహం వేసినప్పుడు మజ్జిగో, మంచి నీరో తాగితే చల్లగా వుంటుంది. ఈ కామదాహంకూడా అలాంటిదే! వాంఛ కల్గిందే అనుకో తీరేదాకా ఆరాటం తగ్గదు. దానికి పగలు రాత్రి అని సమయ నిర్ణయం లేదు. ఆడయినా మగయినా ఆ కోరిక తీరే వరకూ తపన పడ్తారు. పశువుకంటే హీనంగా ప్రవర్తిస్తారు. చిన బాబు దాహం తీర్చుకోడానికి నీకూతురి మీద పడ్డాడే అనుకో! రత్తమ్మ గట్టిగా కేకలు వేయొచ్చుగా! అప్పుడు పెరట్లో వున్న నువ్వైనా పక్క గదిలో వున్న నేనైనా వెళ్లి ఆ అఘాయిత్యాన్ని ఆపుచేసి వుండే వాళ్లం కదా! నీ కూతురికీ ఆ వాంఛ అంతరాంతరాల్లో వుండివుంటుంది. వాడు ప్రోత్సహించాడు. దీని వాంఛ పైకుబికింది. ఇద్దరూ కాలంలో వున్నారు. కల్సిపోయారు! దాహం తీర్చు కొన్నారు! ఏమంటావ్?"

జగన్నాథం సమర్థింపు మాటలకి నిశ్చేష్టురా లైంది ముత్యాలు.

"నా కొడుకు మంచివాడనీ, నీ కూతురు బరితెగించిందనీ నేనడంలేదు ముత్యాలు!" జగన్నాథం మాటలకి తలెత్తి చూసింది ముత్యాలు.

"వాడి పెళ్లాం పురిటికి పుట్టింటికెళ్లి మూణ్ణెల్లయింది! నీ కూతురికి మొగుడుపోయి యేడాదయింది! ఇద్దరూ దాహంతో తపించుకు పోతున్నారు. ఒకరు ప్రేరేపిస్తే రెండో వారు సై అన్నారు. తృప్తిపడ్డారు. దీనికింత గొడవ ఎందుకు?"


"బాబుగారూ! తవరిలా అనడం ధర్మం గాదు!" బావురుమంది ముత్యాలు.


"ఇప్పుడు గొడవ చేస్తే వూరంతా తెలుస్తుంది! చిన బాబు మగాడు. పర్వాలేదు! నీ కూతురు సంగతే ఆలోచించుకో! మొన్న దీపావళికి కూతురితోనూ అల్లుడుతోనూ వాళ్ల పాలి కాపు వెంకడు వచ్చాడు చూసారుగా! చాకు లాంటి కుర్రాడు! మీలో మారు మనువు లున్నాయికదా! వచ్చే నెల్లో ముహూర్తం చూసి నీ కూతుర్ని వాడికిచ్చి పెళ్లి చేద్దామనుకొంటున్నా! దానికి మరో పెళ్లి చేసి నిశ్చింతగా ఈ యింట్లో వుంటావోలేక నానారభస చేసి ఈ గడపదాటి బయటకు పోయి బజార్నపడి ముష్టెత్తుకొని బతుకుతారో ఏదో ఒకటి ఆలోచించుకోండి! ఆలోచించి మరీ రాగాలు తియ్యి!" జగన్నాథం మాటలకి ముత్యాలు నోరు మూతపడింది.

"పెద్దలు! అమ్మాయికి తండ్రిలాంటోరు! తమకెలా తోస్తే అలా చెయ్యండి బాబూ! తమర్నే ఆశ్రయించుకొన్నాం!" అని మాత్రం అనగలిగింది.

అంతలో వీధిలో మోటారు సైకిలు శబ్దం వినబడటంతో వీధిలోకి వెళ్లాడు జగన్నాథం. సైకిలుకి స్టాండు వేస్తూ కన్పించాడు మాధవ రావు. మాధవరావు యింజినీరుగారి ఆఫీసులో గుమస్తా.

"రండి రండి! మంచి ఎండలో వచ్చారు!" ఆహ్వానించాడు జగన్నాథం. వరండాలో వున్న






కుర్చీ చూపించాడు. ఇద్దరూ కూర్చున్నారు. మొహానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకొని అన్నాడు మాధవరావు.

"కొంప మునిగింది జగన్నాథంగారూ!"

"ఎవరి కొంపయ్యా? నా కొంపే?" హేళనగా అడిగాడు.

"ఆ" తలూపాడు మాధవరావు.

"చూసారుగా! మా గ్రామం ఓ మెట్ట మీద వుంది! దాని మీద పదిహేను అడుగులు పునాది వేసి ఈ మేడను కట్టించా. మొన్న వచ్చిన తుఫానుకి గ్రామాలకి గ్రామాలు కొట్టుకొని పోయినా మా వూరి చుట్టు పక్కలకి చేదడు నీరు కూడా చేరలేదు! కనుక ఆ భయం ఎప్పుడూ వద్దు! మంచి ఎండలో వచ్చారు. కూల్ డ్రింక్ తెస్తా! తాగి దాహం తీర్చుకోండి!" అంటూ ఇంట్లోకి వెళ్లాడు జగన్నాథం.

జగన్నాథానికున్న ఎబిలిటీని, పలుకుబడీ బాగా తెలుసు మాధవరావుకి. అయినా తాను చెప్ప బోయే వార్త విన్నాక కుప్పలా కూలిపోక తప్పదు అనుకొన్నాడు మాధవరావు. జగన్నాథం అందించిన కూల్ డ్రింక్‌ను గడగడతాగి కాళీ సీసాని క్రింద వుంచి చెప్పాడు.

"ఇ.ఇ.గారు మీ బ్రిడ్జి యినస్పెక్షన్‌కి సడన్‌గా, సర్‌ప్రయిజ్ విజిట్‌కి బయలుదేరారు! ఈ విషయం మీతో చెప్పడానికి మూడు గంటలు ముందుగా బయలుదేరా! దారిలో బండి ట్రబులిచ్చింది. ఆలస్యం అయింది! ఇ.ఇ.గారీ పాటికి వర్కుస్పాట్ చేరుకొనే వుంటారు! అర్జంటుగా మీరు వెళ్లాలి!" కంగారుగా తాను వచ్చిన పని చెప్పాడు మాధవరావు.

జగన్నాథం ఏమీ కంగారుపడకపోవడంతో అచ్చెరు వొందాడు మాధవరావ్. నిధానంగా చుట్ట ముట్టించి అడిగాడు జగన్నాథం.

"ఈ యి.యీ. మొన్ననే కొత్తగా వచ్చాడు కదూ!"

"అవునండి!" ప్రమోషన్ మీద వచ్చారు! బెజవాడ నుంచి!" "ఇంకా" ఇవాళో రేపో వచ్చి చూద్దాం అనుకొంటున్నా! అప్పుడేయినస్పెక్షన్లకి బయలుదేరారన్నమాట!"

"ఇదే ఫస్టు ఇనస్పెక్షన్ సార్!"

"పేరు అఖండరావు కదూ?"

"'అవునండీ! నిజంగా అఖండుడే!"

"అఖండుడైనా అయోగ్యుడైనా పర్వాలేదయ్యా!" వార్త కష్టపడి తెచ్చావ్ గానీ చాలా ఆలస్యంగా వచ్చావ్!"

"అయ్యా! మూడు గంటలు ముందే అడ్డదారిని బయలుదేరా! రోడ్డు బాగులేక సైకిలు ట్రబులిచ్చింది.!" తాను పడ్డ శ్రమ వృధా అయినందుకు, ఫలితం దక్కనందుకూ విచారించాడు మాధవరావు.

"ఆ మధ్య గుడ్డివాగు మీద రెండున్నర లక్షల బ్రిడ్జిని తిరిగి కట్టి నలభై వేలు నష్ట పోయానని లబోదిబోమని యేడ్చుకొన్నాడు లక్ష్మణరావు. అలా తిరిగి కట్టించిన అఖండుడు ఈయనే కదూ!" అడిగాడు.

"ఎస్సార్!"

"అయితే ఫరవాలేదు!" అన్నాడు జగన్నాథం.

"అదేవిట్సార్?"

"ఆ రోజు లక్ష్మణరావు వచ్చి కాళ్లవేళ్లాపడితే కాదు పొమ్మన్నా, మనకి పోటీ వచ్చాడని! ఆ రోజే ఈ అఖండరావుగారి నీతి నియమాలు ఏమిటో, పుట్టుపూర్వోత్తరాలు ఎలాంటివో అన్నీ తెల్సుకొన్నా. ఎడ్జస్టు అవుతాడో— ఫరవాలేదు. మనల్ని నష్టపెడితే తాను కష్టపడ్తాడు!"

జగన్నాథం అంతటి సమర్థుడని మాధవరావుకి తెలుసు.

అంతలో పరుగు పరుగున వచ్చాడు కూలీ రంగయ్య.

"బాబూ! పట్నం నుంచి పెద్దింజనీరు గోరు వచ్చినారు జీపు మీద! అంతా తనికీలు చేసారు. సిమ్మెంటు ఒత్తి బుగ్గేనని అగ్గయి పోతున్నారు! తమరర్జంటుగా రావాల!"

ఒగర్చుకొంటూ చెప్పాడు.

"పంతులుగారులేర్రటా?" చీకాకు పడ్డాడు.

"ఉన్నారు బాబూ! ఆరిమాట పడ్నీయటం లేదు. తవరర్జంటుగా రావాల!" పంతులుగారు తీసుకురమ్మన్నారు."

లేచి నిలబడ్డాడు జగన్నాథం. శలవు తీసుకొని తిరిగి బయలు దేరాడు మాధవరావు.

వర్కు స్పాట్ చేరుకొని ఇంజనీరుగారితో మాట్లాడ్తూంటే ఇంటి నుంచి కబురు వచ్చింది, జగన్నాథానికి.

"హైదరాబాదు నుంచి మినిస్టరుగారు పిలుస్తున్నారని."

"పొద్దుటేకదయ్యా మాట్లాడింది! అప్పుడే ఏం కొంప మునిగింది? ఇంజనీరుగారు బ్రిడ్జి యినస్పెక్షన్ చేస్తున్నారని, రాత్రి లైట్నింగ్ కాల్ బుక్‌చేసి మాట్లాడ్తానని చెప్పు." విసుక్కొన్నాడు జగన్నాథం.


తాను చెప్పిన సంజాయిషీలూ యిబ్బందులూ ఏమీ యింజనీరుకి నచ్చలేదు. అప్పుడే చెట్టు నుంచి దింపిన కొబ్బరిగెల అలానే వుండిపోయింది. ఇంటి నుండి తెప్పించిన కూల్‌డ్రింక్స్ వేడెక్కాయి. ఇంజనీరుగారు తాగలేదు. కూడా వచ్చిన వారిని తాగమనలేదు.

"అయాం సారీ! మిస్టర్ జగన్నాథం! పని ఆపు చేసి ఒక సారి ఆఫీసుకురండి!" కటువుగా అనేసి జీపెక్కాడు యి.యీ. అఖండరావు.

జీపు బయలుదేరింది దుమ్ములేపుకొంటూ. అటు వైపే చూస్తూ ఆలోచనలో పడ్డాడు జగన్నాథం.

* * *

జగన్నాథానికి ఆ చుట్టు పక్కల వున్న మూడు తాలుకాల్లోనూ పెద్ద పలుకుబడి వుంది. జిల్లా స్థాయిలో కూడా ముఖ్యుల్లో ఒకనిగా పరిగణించబడ్డాడు. పోయిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నిలబడమని అభిమానులంతా పట్టు బట్టడంతో ఇండిపెండెంటుగా నామినేషన్ దాఖలు చేసాడు. వ్యవధి చాలనందున పాలక పార్టీ టికెట్ లభించడానికి ప్రయత్నం చేయలేక



పోయాడు. అప్పటికే మినిస్టర్‌గా వున్న తృష్ణా రావుకి పార్టీ టికెట్ లభించింది. జగన్నాథం నామినేషన్ వేసాడన్న వార్త విన్న తృష్ణారావుకి వణుకు ప్రారంభం అయింది. రాత్రికి రాత్రి జీపులో బయలుదేరాడు జగన్నాథాన్ని కల్సుకోవడానికి. తాను మినిస్టరుగా వున్నంత కాలం తన నియోజక వర్గానికి, ప్రజలకీ ఏమీ చేయలేకపోయ్యాడు. ఆ అసంతృప్తి ప్రజల్లో పేరుకుపోయింది. తన నియోజకవర్గం ప్రజల నందర్నీ ఏక త్రాటి మీద నడిపించిగల శక్తి ఒక్క జగన్నాథానికే వుంది. ఆ జగన్నాథం తనకు ప్రత్యర్థి అయితే తనకు పరాజయం తప్పదు. మినిస్టరు హోదా గోవిందా! తిరిగి తాను మామూలు మనిషవుతాడు. ఆ పరిస్థితిని వూహించుకుంటే శరీరం కంపరంతో స్వాధీనం తప్పింది తృష్ణారావుకి. జగన్నాథాన్ని ఒప్పించాలి. తనకు అడ్డు రాకుండా చూసుకోవాలి! ఎలాంటి వాగ్దానాలనైనా చెయ్యాలి. తనకు మంత్రి పద[illegible] ముఖ్యం. మంత్రి కావాలంటే ముందు గె[illegible]వాలి. గెలవాలంటే జగన్నాథం అం[illegible] సంపాదించాలి.

"నీ అండా అభిమానం వుండటం వల్ల క్రిందటి ఎలక్షన్లలో గెలిచానోయ్! అదృష్ట బావుండి మినిస్టరు నయ్యాను. లోతుపాతుల[illegible] తెల్సుకొన్నా! నిజాయితీ పరుడనని పెద్ద వా[illegible] మెప్పు మన్ననలూ పొందాను. మన తాలూకా[illegible] మన ప్రజలకే ఏమీ మేలు చేయలేకపోయా నన్నది. నిజం! మళ్లీ ఈ సారి కూడా మంత్రి నయితే సీనియర్‌ని అవుతా. మన తాలూకాలో నువ్వు కోరుకొన్న ఆ రెండు పరిశ్రమలూ స్థాపించే యేర్పాటు చేస్తా! మన గ్రామానికి మధ్యగా పంటకాలువ తవ్వించే యేర్పాటుచేస్తా! అందుకు నువ్వు అవకాశం యివ్వాలి జగన్నాథం! నువ్వు నిలబడితే నీ గెలుపు ఖాయం! నా ఓటమి తథ్యం. కృష్ణార్జునుల్లాంటి వాళ్లం! మనలో మనకి పోటీయా? అయిదు సంవత్సరాలు మంత్రిగా మసలిన నేను తిరిగి మామూలు మనిషిగా




## ఇంకా రాసేదేముంది?

ఏది వదలి పెట్టావని?
అన్నీ నువ్వే ఒడిసి పట్టుకున్నావ్
ఏమి మిగిల్చిపోయావని?
అంతా నువ్వే గటగట తాగేశావ్.
ఏ మార్గంలో చూసినా
నీ భారీ నడకల అడుగుల గురుతులే
దేన్ని పట్టుకోబోయినా
కనిపించే నీ చేతి వేలిముద్రలే
ఏది వదలి పెట్టావని? ఏమి మిగిల్చిపోయావని?
ఈ శతాబ్దం తలంపై నిల్చొని
రాబోయే శతాబ్దంలోకి
నీ చేతులను భారంగా చాపావ్
నిటారుగా నిలబడ్డావ్.
ఎవరు చెప్పు—
నిన్ను సరిగ్గా తలయెత్తి చూడగల్గిన వాళ్ళు
ఎవరు చూపు—
నీ నడుం వరకు నిలబడగల్గిన వాళ్ళు.
కాలాన్నీ, స్థలాన్నీ నువ్వే ఆక్రమించుకున్నావ్
ఇంకా మా చోటేది?
ఎంతసేపూ నువ్ నడిచిన బాటలోనే
మేం నడిచినా, పరుగులు తీసినా!
అలవోకగా నువు విసిరిన మాటల్నే
అదే పనిగా చప్పరించడంకన్న
మేం చేసేదేముంది.
నీ కొటేషన్లతో మా కవిత్వంలో
కోటలు కట్టడం కన్న
ఇంకా రాసేదేముంది.
నీ పేరు ముందుగా రాయని
సాహిత్యం ఉందా-ఉంటుందా!
కానీ ఒక్కమాట—
(శ్రీ)(శ్రీ) పోయాక తెలుగు సాహిత్యమంతా బీడు
అనే అపవాదు రానీకుండా చూడు
అదీ నీక్కూడా ఏం బావుంటుంది చెప్పు?

—జి. వెంకటేశ్వర్లు

తిరగడవా? ఆ పరిస్థితి వూహించుకొంటేనే భయం వేస్తోంది. తిరిగి నన్ను మినిస్టరు కానీ! నీ ఆశయాలు నెరవేరుస్తా! నీ ఆజ్ఞ ప్రకారం నడుచుకొంటా!''

ఏకాంతంలో ప్రబతిమాలుకొన్నాడు తృష్ణేరావు.

''క్రితం సారి నిన్ను నిలబెట్టాను! మంత్రివి అయివుండి కూడా మన వాళ్లకేంచేసావ్? ఒక్కటి చెప్పు!'' నిగ్గదీసాడు జగన్నాధం.

''నీలాంటి పెద్దవాళ్లు'మనవాళ్లకేం జేసావ్!' అని మామూలు అలగా జనంలా అడక్కూడదయ్యా!'నాకేం చేసావ్'అని అడగాలి! ఈ సారి కూడా నన్ను మినిస్టరు గానీ! ఈ జిల్లాలోని కాంట్రాక్టులన్నీ నీకే యిప్పిస్తా! ఆ రంగంలో నీకు చాలా అనుభవం వుంది. నాలుగు రాళ్ల సంపాదించుకోగలవ్! మరోసారి నాకు అవకాశం యివ్వు!''

ప్రాధేయపడ్డాడు మినిస్టరు తృష్ణేరావు.

ఆలోచనలో పడ్డాడు జగన్నాథం.

తృష్ణేరావుది పదవీ వ్యామోహం! తనకి ధన దాహం! తృష్ణేరావు మాటల్లో నిజం లేకపోలేదు. తనకు రాజకీయాల్లో అనుభవం లేదు. మినిస్టర్ పదవిని కలలో కూడా వూహించుకోనవసరం లేదు. తన వైపే తన అంగీకారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాడు తృష్ణేరావు.

'సరే!' అనక తప్పలేదు జగన్నాథానికి.

మళ్లీ మినిస్టర్ అయ్యాడు తృష్ణేరావు.

* * *

కారు జోరుగా పట్నం వైపు పరుగెత్తుతూంటే కారులో కూర్చున్న జగన్నాథం మనసులోని ఆలోచనలు మరింత స్పీడుగా పరుగులు తీస్తున్నాయ్. ఇంజనీరు అఖండరావు గారి కుటుంబ విషయాలన్నీ క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు. ఆ మధ్య అమ్మాయికి ఓ సంబంధం చూసారుయింజనీరుగారు. అబ్బాయి కాకినాడలో డాక్టరు. అన్నీ బాగున్నాయ్. కట్నం దగ్గరే కుదర్లేదు.-పాతికవేలు అడిగారు. పదిహేను వేలు కన్నా ఎక్కువ యిచ్చుకోలే నన్నారు అఖండరావు. సంబంధం కుదరలేదు. పెద్దబ్బాయికి మెడికల్ కాలేజీలో సీటుకి ట్రై చేసారు. సీటు దొరకలేదు. బి.ఎస్సీ.లో జాయిన్ చేసారు. వారికున్న ఆ రెండు సమస్యలనీ తీరుస్తే తానీ పెద్ద గండం నుంచి బయట పడచ్చు! ఆయన డబ్బు తీసుకోరు. వారి సమస్యలు పరిష్కారం అయితే చాలు! తానీ గండం నుంచి గట్టెక్కప్పోతే చాలా నష్ట పడ్తాడు. లక్షన్నర ఖర్చు అయింది అప్పుడే! తిరిగి కట్టాలంటే చాల నష్టపోవాలి!

ఇంజనీరుగారి బంగళా ముందు ఆగింది కారు. ముందుగా కారు దిగాడు జగన్నాథం.

''కారు డిక్కీతీసి అందులోని బుట్టలని బయటపెట్ట'' మన్నారు డ్రైవర్ని పంతులు గారు.

''అప్పుడే వద్దు!'' వారించాడు జగన్నాథం. పంతులుగార్నీ, డ్రైవర్ని కారులో వుండమని చెప్పి లోనికి వెళ్లాడు జగన్నాథం.

గంటన్నర తర్వాత బయటకు వచ్చాడు జగన్నాథం. కళకళలాడ్తున్న మొహంతో కారులో వున్న బుట్టల్ని దగ్గరుండి ఇంజనీరు గారింట్లో పెట్టించాడు జగన్నాథం.

* * *

ఇంజనీరు గారమ్మాయికి పెళ్లయింది! అబ్బాయికి మెడికల్ కాలేజీలో సీటు దొరికింది !

ఆ గ్రామానికి పంట కాలువ సాంక్షన్ అయిందని సగర్వంగా ప్రకటించారు మినిస్టరు తృష్ణేరావు గారు!!

రత్తమ్మకి పెళ్లిచేసి అత్తారింటికి పంపింది ముత్యాలు!!!

